## క్లుప్తంగా

### డ్యూయల్ డిగ్రీ కోర్సులపై చర్చ

**ఉస్మానియా యూనివర్సిటీ:** ఓయూ మెల్‌బోర్న్ వర్సిటీల ఆధ్వర్యంలో ప్రారంభం కానున్న డ్యూయల్ డిగ్రీ కోర్సులపై శనివారం రెండో దఫా చర్చలు జరిగాయి. బీఎస్సీ గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జీవశాస్త్రం కలయికతో ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ వర్సిటీ, ఓయూలో 2024–25 విద్య సంవత్సరం నుంచి నాలుగేళ్ల డిగ్రీ కోర్సులు ప్రారంభం కానున్నాయి. డ్యూయల్ డిగ్రీలో ప్రవేశం పొందిన విద్యార్థులకు రెండు సంవత్సరాలు ఓయూలో చదివి మరో రెండు సంవత్సరాలు మెల్‌బోర్న్ వర్సిటీలో చదివేందుకు అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెల్‌బోర్న్ వర్సిటీ ప్రొఫెసర్లతో పాటు ఓయూ వీసీ ప్రొ.రవిందర్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, గణితశాస్త్రం విభాగం హెడ్ ప్రొ.కిషన్ పాల్గొన్నారు.

### మహిళలు రాణించాలి

**అమీర్‌పేట:** మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని సరోజినీ దేవీ ఆస్పత్రి మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ రవిందర్‌గౌడ్ అన్నారు.శనివారం బల్కంపేట శంకర నేత్రాలయంలో ఉగాది పండుగను దృష్టికి ఉంచుకుని బేగంపేటకు చెందిన ఆశా వర్కర్లను సన్మానించి చీరలను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆశా వర్కర్లు చాలీచాలని వేతనాలతో కుటుంబ బాధ్యతలు చేపడుతున్నారని వారికి తాను ఎప్పుడు అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్,రాపోలు టోని, సాయి, రామచంద్రయ్య పాల్గొన్నారు.

### పూర్వ విద్యార్థుల విరాళం

**ఉస్మానియా యూనివర్సిటీ:** ఓయూ అనుబంధ సైఫాబాద్ పీజీ కాలేజీకి పూర్వ విద్యార్థులు విరాళాన్ని అందజేశారు. శనివారం ఓయూ వీసీ ప్రొ.రవిందర్‌కు పూర్వ విద్యార్థులు డాక్టర్ మధుసూదన్‌రెడ్డి రూ.లక్ష, ఎన్‌ఆర్‌ఐ డాక్టర్ చంద్రశేఖర్ రూ.50 వేల చెక్‌ను అందజేశారు. కళాశాల అభివృద్ధికి గతంలో పూర్వ విద్యార్థులు పాలేరు ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి రూ.5 లక్షలు, ఎన్‌ఆర్‌ఐలు రవిప్రకాష్‌రెడ్డి, అమృత్, పురుషోత్తం బాబు చెరోలక్ష అందజేసినట్లు ప్రిన్సిపల్ ప్రొ.లక్ష్మణ్ నాయక్ తెలిపారు. వీవీ సెమినార్ హాల్ మరమ్మతులకు రూ.30 లక్షల నిధులను సేకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ తెలిపారు.

### రోగి సహాయకుడి అదృశ్యం

**చిలకలగూడ :** గాంధీ ఆస్పత్రి వచ్చిన ఓ రోగి సహాయకుడు అదృశ్యమయ్యాడు. చిలకలగూడ ఎస్‌ఐ కిషోర్ వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా గజ్వేలు మండలం బెజగామ గ్రామానికి చెందిన మల్లమ్మ అస్వస్థతకు గురై గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. మల్లమ్మకు సహాయకునిగా ఉంటున్న కుమారుడు యాదగిరి (40) ఈ నెల 16న వార్డు నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. పరిసర ప్రాంతాలతో పాటు స్వగ్రామంలో వాకబు చేసిన ఫలితం లేకపోవడంతో సోదరుడు సత్తెయ్య శనివారం పోలీసులను ఆశ్రయించాడు. ఆచూకీ తెలిస్తే 040–27853597 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

### డ్యూటీకని వెళ్లిన యువతి..


ప్రశాంతి

**అమీర్‌పేట:** డ్యూటీకని వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన ఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.ఎస్సై స్వప్నరెడ్డి వివరాల ప్రకారం.. అమీర్‌పేట దివ్య శక్తి అపార్ట్‌మెంట్స్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్న ప్రశాంతి(22) మాదాపూర్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తోంది. 17వ తేదీన ఎప్పటిలాగే డ్యూటీ కోసం వెళ్లిన ప్రశాంతి తన గురించి వెతకవద్దని తండ్రికి వాట్సాప్ మెసేజ్ పెట్టింది.వెంటనే ఆయన ఫోన్ చేయగా స్విచ్చాఫ్ వచ్చింది. పనిచేసే చోటుకు వెళ్లి ఆరా తీయగా మూడ్రోజుల క్రితమే ఉద్యోగానికి రాజీనామా చేసినట్లు తెలిపారు. ఆచూకీ కోసం స్నేహితులు, బంధువుల వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో శనివారం తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

### ఎన్నికల రద్దును స్వాగతిస్తున్నాం

కంటోన్మెంట్ వికాస్ మంచ్


సంబురాల్లో వికాస్ మంచ్ నేతలు

**కంటోన్మెంట్:** కంటోన్మెంట్ ఎన్నికలను రద్దు చేయడాన్ని తాము స్వాగతిస్తున్నామని కంటోన్మెంట్ వికాస్ మంచ్ (సీవీఎం) అధ్యక్షుడు గడ్డం ఏబెల్ అన్నారు. సభ్యులతో కలిసి శనివారం పికెట్ చౌరస్తాలో సంబురాలు నిర్వహించి మాట్లాడారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించడాన్ని తాము స్వాగతిస్తామని ఓ వైపు కంటోన్మెంట్ నూతన బిల్లు, జీహెచ్ఎంసీలో విలీనం అంశాలు పెండింగ్‌లో ఉండగానే ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయడం అప్రజాస్వామికమన్నారు. తాము గత నెల 21 లీగల్ నోటీసు జారీ చేయగా, సంబంధిత అధికారుల నుంచి ఎలాంటి సమాధానం రాలేదన్నారు. దీంతో హైకోర్టులో రిట్ దాఖలు చేశామన్నారు. ఇంతలోనే కేంద్రం తాము ఇచ్చిన ఎన్నికల నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవడం హర్షణీయమన్నారు.

# గడి స్కూల్

## ఇచ్చట వ్యయసాయమూ నేర్పబడును!

- విద్యార్థులకు పాఠాలతో పాటు కూరగాయల పెంపకంపై అవగాహన
- పాఠశాల ఆవరణలో వివిధ రకాల పంటల పెంపకం
- ఆదర్శంగా నిలుస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

**లాలాపేట:** తార్నాక డివిజన్ లాలాపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (గడిస్కూల్)లో విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాలే కాకుండా నిత్య జీవితంలో ఉపయోగపడే వ్యవసాయ సాగుబడి పాఠాలను బోధిస్తున్నారు. ప్రస్తుత నగర జీవన విధానంలో నేటి తరానికి రోజుతినే అన్నం బియ్యం ఎక్కడి నుంచి వస్తాయో తెలియని పరిస్థితి ఉంది. ఇలాంటి నేపథ్యంలో హైదరాబాద్ నగరం నడిబొడ్డున సిటీలోని విద్యార్థులకు వ్యవసాయ పాఠాలను బోధిస్తూ ఓ ప్రత్యేకతను చాటుతున్నారు. హైదరాబాద్ నగరంలోనే లాలాపేటలోని ప్రభుత్వ పాఠశాల(గడి స్కూల్) ఉపాధ్యాయులు తోటి ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. జిల్లా విద్యాధికారులు సైతం లాలాపేట ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల పనితీరును ప్రశంసిస్తున్నారు.


కూరగాయల సంరక్షణలో నిమగ్నమైన ఉపాధ్యాయులు, విద్యార్థులు

**ప్రధానోపాధ్యాయుడి ప్రత్యేక చొరవతో..**

గతకొంత కాలంగా ప్రధానోపాధ్యాయుడు ఏ. ప్రతాప్‌రెడ్డి సారథ్యంలో గడి స్కూల్ ఆవరణలో సేంద్రీయ పద్ధతిలో ఆకుకూరలు, కూరగాయలు, పండ్ల సాగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీంట్లో విద్యార్థులు, ఉపాధ్యాయులను భాగస్వామ్యం చేస్తున్నారు. విద్యార్థులకు తరగతి గదిలో పాఠ్యాంశాల బోధనతో పాటు సాయంత్రం వేళలలో సాగు అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి ఉత్సాహంగా తోటపని చేస్తున్నారు. పాఠశాల ఆవరణలో చేపట్టిన సాగుబడిలో కాపుకొచ్చిన కొత్తిమీర, పాలకూర, తోటకూర వంటి పలు రకాల ఆకుకూరలను కోసి విద్యార్థులకు పంచిపెడుతున్నారు. తాము పండించిన పంటలను చూస్తూ ఉపాధ్యాయులు, విద్యార్థులు మురిసిపోతున్నారు.


పండించిన ఆకుకూరలను చూపిస్తున్న ఉపాధ్యాయులు

**రైతు బిడ్డగా ప్రతాప్‌రెడ్డి**



రైతు కుటుంబం నుంచి వచ్చిన ఏ. ప్రతాప్‌రెడ్డి ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తూనే తనకు వ్యవసాయం పట్ల ఉన్న మక్కువను ఈ విధంగా స్కూల్‌లో తోట ఏర్పాటుకు కారణమైంది. మెట్రోపాలిటన్ నగరాల్లో నేల కరువై డాబాలు, తోటలలో ఆకుకూరలు, కూరగాయలు పండిస్తున్నారు. తమ పాఠశాలలో విశాలమైన స్థలం ఎంతో ఉంది ఇక్కడి సేంద్రీయ పద్ధతిలో ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు పండించడానికి ఎంతో అనువైన వాతావరణం ఉంది. దీంతో విద్యార్థులకు మనం తినే కూరగాయలు, ఆకుకూరలను ఏవిధంగా పండిస్తారు అనే విషయాన్ని తెలియజేయడంతో పాటు వారికి స్వచ్ఛమైన కూరగాయలను అందించవచ్చేనే ఉద్దేశ్యంతో గత కొన్ని సంవత్సరాల నుంచి ఈ సేంద్రీయ సాగు చేస్తున్నారు. ఉపాధ్యాయుడిగా ఉత్తమమైన సేవలందిస్తూనే మరో వైపు ఇలాంటి కార్యక్రమాలను చేస్తూ ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు పొందుతున్నారు. గతంలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డును సైతం అందుకున్నారు.

## కూతురి అప్రమత్తతతో తల్లి ప్రాణాలు క్షేమం

**ఆత్మహత్యకు యత్నించిన మహిళను కాపాడిన పోలీసులు**


జీఆర్పీ పోలీసులతో కావ్య

**సికింద్రాబాద్:** భర్త వేధింపులు తాళలేక ఓ మహిళ ఆత్మహత్యకు యత్నించగా రైల్వే పోలీసులు ఆమెను కాపాడి సొంతూరికి పంపించారు. హెడ్‌కానిస్టేబుల్ డేవిడ్‌రాజ్ కథనం ప్రకారం. విశాఖపట్నంలోని గాజువాకకు చెందిన కావ్య(36), శ్రీను దంపతులు. వీరికి ఇద్దరూ పిల్లలు. మద్యానికి బానిసైన శ్రీను నిత్యం కావ్యను వేధించేవాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన ఆమె హైదరాబాద్‌కు చెందిన తన సోదరుడికి ఫోన్ చేసి వస్తున్నానని చెప్పింది. తన కూతురితో కలిసి శనివారం ఉదయం 9 గంటలకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చిన కావ్య తన సోదరుడికి ఫోన్ చేయగా స్విచ్చాఫ్ వచ్చింది. దీంతో తన బాధ ఇంకెవరితో చెప్పుకోవాలో అర్థం కాని పరిస్థితుల్లో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో 8, 9వ ప్లాట్ ఫాంలో వేచి ఉంది. తనకు మనశ్శాంతి లేదని రైలు కిందపడి చనిపోతానని చెప్పి ఆత్మహత్య చేసుకునే ప్రయత్నం చేయగా, వెంటనే ఆమె కూతురు డయల్ 100కు కాల్ చేసి విషయం చెప్పగా క్షణాల్లో ఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు కావ్యను కాపాడారు. అనంతరం ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చి రైలులో సొంతూరికి పంపించారు.

## రేపు లోకో, రన్నింగ్ స్టాఫ్ సమస్యలపై నిరసన

**అడ్డగుట్ట:** లోకో, రన్నింగ్ స్టాఫ్ సమస్యలపై దేశవ్యాప్తంగా అన్ని క్రూ లాబీల వద్ద దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టనున్నట్లు డివిజనల్ కార్యదర్శి రవీందర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆల్ ఇండియా రైల్వేమెన్ ఫెడరేషన్ పిలుపు మేరకు మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శంకర్‌రావు ఆదేశానుసారం సికింద్రాబాద్ డివిజన్‌లోని అన్ని క్రూ లాబీల వద్ద పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రైల్వే బోర్డు, జోనల్ అధికారులు రన్నింగ్ స్టాఫ్‌ను కట్టు బానిసల్లాగా భావిస్తూ అనేక కార్మిక వ్యతిరేక ఉత్తర్వులతో వారిని తీవ్ర మనోవేదనకు గురి చేస్తున్నారని ఆరోపించారు. దానికి వ్యతిరేకంగా లోకో, రన్నింగ్ స్టాఫ్ సమస్యలపై కుటుంబ సభ్యులతో కలిసి నిరసన ప్రదర్శనలు చేయనున్నట్లు వెల్లడించారు. రన్నింగ్ స్టాఫ్, డ్రైవర్లు, ట్రైన్ మేనేజర్లు వారి కుటుంబసభ్యులతో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

### 'సమస్యల పరిష్కారంలో విఫలం'


మాట్లాడుతున్న సీపీఐ నేతలు

**అడ్డగుట్ట:** ప్రజా సమస్యల పరిష్కారంలో స్థానిక కార్పొరేటర్ విఫలమయ్యారని సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ ఆరోపించారు. అడ్డగుట్టలోని సీ–సెక్షన్‌లో శనివారం సీపీఐ నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా కాంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. సీ సెక్షన్‌లోని నాలా పక్కనే ఖాళీస్థలం ఉండడంతో అక్కడ చెత్త వేస్తుండటంతో డంపింగ్‌యార్డును తలపిస్తుందన్నారు. అంతే కాక దట్టమైన పిచ్చి మొక్కలు పెరగడంతో పాములు, తేళ్లు సంచరిస్తూ స్థానికంగా ఉన్న ఇళ్లలోకి వస్తున్నాయన్నారు. రాత్రి సమయాల్లో ఆ ప్రాంతం మందుబాబులు హల్‌చల్ చేస్తుండటంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు.స్థానిక కార్పొరేటర్ స్పందించి వెంటనే సదరు ఖాళీ స్థలంలో పేరుకుపోయిన చెత్తా చెదారం, పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేయించేలా చర్యలు తీసుకోవాలని అదే విధంగా నీటి ఎద్దడి సమస్యతో ఇబ్బంది పడుతున్న అక్కడి బస్తీవాసులు సౌకర్యార్థం వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో ఉమర్ఖాన్, బాబు, యాదగిరి, లతీఫ్, శంకరయ్య, ఖాజా, ఖాదర్, రషీద్, డేవిడ్, చాంద్‌పాషా, శంకర్, శ్రీను పాల్గొన్నారు.

## నిరుద్యోగులకు పరిహారం చెల్లించండి


ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న దయాకర్ గౌడ్, తదితరులు

**ఉస్మానియా యూనివర్సిటీ:** టీఎస్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలని తెలంగాణ విద్యార్థి, నిరుద్యోగ ఫ్రంట్ చైర్మన్ చనగాని దయాకర్‌గౌడ్ డిమాండ్ చేశారు. యూనివర్సిటీ లైబ్రరీలో ఉద్యోగ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా దయాకర్‌గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడిన తర్వాత తొలిసారిగా వెలువడిన వివిధ ఉద్యోగాల నోటిఫికేషన్లకు దరఖాస్తు చేసుకొని రూ. వేలల్లో ఖర్చుచేసి శిక్షణ పొంది పరీక్షలకు చదివిన నిరుద్యోగులకు పేపర్ల లీకేజీతో తీరని అన్యాయం జరిగిందన్నారు. అక్రమాలకు నిలయంగా మారిన టీఎస్‌పీఎస్సీలో ఉద్యోగాల నోటిఫికేషన్ల మొదలు నియామకపు ఉత్తర్వుల వరకు వ్యాపార ధోరణిలో ఖాళీ పోస్టులను భర్తీ చేయడం దారుణమన్నారు. పెద్దల హస్తంతో రూ. కోట్లల్లో కుంభకోణం జరుగుతున్న టీఎస్‌పీఎస్సీలో 2014 నుంచి వెలువడిన అన్ని నోటిఫికేషన్ల పై విచారణ జరిపించాలని, రద్దు చేసిన వివిధ ఉద్యోగాల పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న ఒక్కొక్క అభ్యర్థికి రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

### ఓయూ విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో..



టీఎస్‌పీఎస్సీ అక్రమాలపై ఓయూలో ఐదో రోజు నిరసనలు వెల్లువెత్తాయి. శనివారం వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా ర్యాలీలు, ధర్నాలు, దిష్టిబొమ్మల దహనాలు, ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో క్యాంపస్‌ను హోరెత్తించారు. ఓయూ విద్యార్థి జేఏసీ, టీఎస్ జాక్ చైర్మన్ భట్టు శ్రీహరినాయక్, అధ్యక్షులు నవీన్‌యాదవ్ ఆధ్వర్యంలో కళ్లకు గంతలు కట్టుకొని అర్ధనగ్న ప్రదర్శన చేపట్టగా ఎన్‌టీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు బైరు నాగరాజుగౌడ్ ఆధ్వర్యంలో న్యాయకళాశాల ఎదుట ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. శరత్‌నాయక్, కళ్యాణ్, నెహ్రూనాయక్, సురేష్‌యాదవ్, ఆంజనేయులు, విజయ్‌నాయక్ ఆధ్వర్యంలో ఒకరోజు నిరసన దీక్ష నిర్వహించారు.

### సంక్షేమ పథకాలు పేదలకు వరం


చెక్కు అందజేస్తున్న మాధవరం కృష్ణారావు

**సనత్‌నగర్:** కల్యాణలక్ష్మి, షాదీ ముబాకర్ వంటి పథకాలు పేదలకు వరం లాంటిదని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బేగంపేట డివిజన్‌కు చెందిన పలువురికి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను శనివారం ఆయన అందజేసి మాట్లాడారు. యావత్ దేశం ఆచరించేలా రాష్ట్రంలో కేసీఆర్ సర్కార్ సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు పరుస్తోందన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ఎజెండాగా పథకాలకు రూపొందిచారన్నారు. గతంలో నిరుపేదలు ఆడబిడ్డల పెళ్లి చేయాలంటే ఆర్థిక ఇబ్బందులతో అవస్థలు పడేవారని, ప్రస్తుతం ప్రభుత్వం తరపున రూ. లక్ష ఆర్థిక సహాయం అందిస్తూ వారికి చేయూతగా నిలుస్తోందన్నారు. ఇలాంటి పథకం దేశంలో ఎక్కడ కూడా లేవన్నారు. సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## కేంద్రం నియంతృత్వానికి నిదర్శనం : మర్రి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మర్రి రాజశేఖర్‌రెడ్డి

**కంటోన్మెంట్:** కంటోన్మెంట్ల పాలనలో కేంద్రం నియంతృత్వ ధోరణి పరాకాష్టకు చేరిందన్నారు బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. బోయిన్‌పల్లిలోని తన కార్యాలయంలో బోర్డు మాజీ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నేతలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా కంటోన్మెంట్లకు ఎన్నికల నోటిఫికేషన్‌ను ఎలాంటి కారణాలు లేకుండానే ఉపసంహరించుకోవడం తుగ్లక్ పాలనను తలపిస్తుందన్నారు. ఫిబ్రవరి17 దేశవ్యాప్తంగా 57 కంటోన్మెంట్‌లలో ఎన్నికలు జరపాలని కేంద్రం గజెట్‌ని జారీ చేయగా దాని అనుసరించి మార్చి 1న కంటోన్మెంట్ పబ్లిక్ నోటీస్ జారీ చేయడం జరిగింది. త్వరలోనే నామినేషన్‌ల ప్రక్రియ ప్రారంభించాల్సి ఉండగా ఇంతలోనే కేంద్రం ఎన్నికల నోటిఫికేషన్‌ను రద్దు చేయడం దారుణమన్నారు. కంటోన్మెంట్‌లో ఓటు హక్కుకు దూరమైన వారి ఓట్లను పునరుద్ధరించాలని తమ నేత కేటీఆర్ కేంద్ర రక్షణ మంత్రికి లేఖ రాసిన 24 గంటల్లోనే ఇలాంటి నిర్ణయం తీసుకోవడం ఏంటని ప్రశ్నించారు. ఈ సమావేశంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి, మాజీ బోర్డు సభ్యులు పాండు యాదవ్, నళిని కిరణ్, ప్రభాకర్, లోకనదం,శ్యామ్ కుమార్, పెద్దల నరసింహ, ముప్పిడి మధుకర్, కిరణ్, శేఖర్ , ప్రవీణ్ పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌ను బలోపేతం చేద్దాం

అమీర్‌పేట: సనత్‌నగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు కలిసి కట్టుగా పనిచేద్దామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి హాథ్ సే హాథ్ జోడో అభియాన్ ప్రోగ్రాం ఇన్‌చార్జి కోటిం రెడ్డి వినయ్‌రెడ్డి పిలుపునిచ్చారు. నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులతో శనివారం ఆయన సమావేశమై మాట్లాడారు. కాంగ్రెస్‌కు సనత్‌నగర్ కంచుకోట అన్నారు. నాయకుల కన్నా పార్టీ క్యాడర్ బలంగా ఉందని, హాథ్ సే హాథ్ జోడో యాత్ర ద్వారా కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధిని మరోసారి ప్రజలకు వివరించి పార్టీకి బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షులు అబ్దుల్లా సోహెల్, మాజీ కార్పొరేటర్ కంజర్ల శ్రీనివాస్‌యాదవ్ ,అనిల్‌కుమార్ యాదవ్, జి.నాగరాజ్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

### మహిళలను ఆదర్శప్రాయులుగా తీర్చిదిద్దుతాం

**రాంగోపాల్‌పేట్:** సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలోని మహిళలను ఆదర్శప్రాయులుగా తీర్చిదిద్దేందుకు శ్రీగణేష్ ఫౌండేషన్ కృషి చేస్తుందని ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీగణేష్ అన్నారు. శనివారం రెజిమెంటల్‌బజార్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించి మహిళలకు చీరలను పంపిణీ చేశారు. నేటి సమాజంలో అన్ని రంగాల్లో మహిళలు సేవలు అందిస్తున్నారని వారిని మరింత చైతన్య వంతుల్ని చేసేందుకు తమ వంతు కృషి చేస్తామని శ్రీగణేష్ చెప్పారు. త్వరలో కంటోన్మెంట్ నియోజకవర్గంలో స్వయం ఉపాధి కోసం శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామని, మన కంటోన్మెంట్-మన అభివృద్ధి నినాదంతో పనిచేసే వీటిలో మహిళందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

### పెళ్లి చేసుకుంటానని మోసం: యువకుడిపై కేసు

**అమీర్‌పేట:** పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిపై అత్యాచారానికి పాల్పడిన యువకుడిపై కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా రాయవరం గ్రామానికి చెందిన ఓ యువతి (27) యువతి ఉద్యోగం కోసం నగరానికి వచ్చి ఎస్‌ఆర్‌నగర్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటుంది. బాపూనగర్‌కు చెందిన నరేష్ తేజావత్ (25) అనే యువకుడు పరిచయం అయ్యాడు. ప్రేమిస్తున్నానని.. పెళ్లి కూడా చేసుకుంటానని చెప్పి ఇటీవల స్థానికంగా ఓ ఇంటికి తీసుకువెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. పెళ్లి ప్రస్తావన తేవడంతో తప్పించుకుని తిరుగుతుండటంతో బాధితురాలు శనివారం ఫిర్యాదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపారు.

### అప్పు తీర్చలేక వ్యక్తి ఆత్మహత్య

**అమీర్‌పేట:** అప్పులు తీర్చలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. తూర్పుగోదావరి జిల్లా జగ్గంపేట మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన బి.వీరబాబు (40) జీవనోపాధి కోసం నగరానికి వచ్చి మధురానగర్‌లోని ఓ నర్సరీలో తోటమాలిగా పనిచేస్తున్నాడు. ఇటీవల కూతురు పెళ్లి చేశాడు. దీని కోసం రూ.5 లక్షల వరకు అప్పు చేశాడు. తీర్చలేక మానసిక ఒత్తిడికి గురయ్యాడు శుక్రవారం ఉదయం పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లగా గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం గాంధీకి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు.

### త్వరలో పార్కింగ్ కాంప్లెక్స్ పనులు పునఃప్రారంభం



**అమీర్‌పేట:** బల్కంపేట ఎల్లమ్మ దేవాలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం నిర్మించనున్న మల్టీ లెవల్ పార్కింగ్ కాంప్లెక్స్ భవన నిర్మాణ పనులు పునః ప్రారంభం కానున్నాయని అధికారులు తెలిపారు. నిర్మాణ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు కాంప్లెక్స్‌కు సంబంధించిన డ్రాయింగ్స్‌ను అధికారులు సకాలంలో ఇవ్వకపోవడంతో పుట్టింగ్‌ల వరకు పనులు చేసి ఆపేశారు. నాలుగు నెలలుగా పనులు పూర్తిగా నిలిచిపోగా ఆలయ కార్యనిర్వాహణ అధికారి అన్నపూర్ణ శనివారం ఆర్కిటెక్టర్, దేవాదయ శాఖ ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్‌తో సమావేశం నిర్వహించి భవనాల డ్రాయింగ్స్‌ను కాంట్రాక్టర్‌కు అందజేశారు.ఈ నెల 20వ తేదీ నుంచి పనులు ప్రారంభమవుతాయని ఈ సందర్భంగా అన్నపూర్ణ తెలిపారు. ఎక్కువ సంఖ్యలో కార్మికులను అందుబాటులో పెట్టుకుని నిబంధనల ప్రకారం త్వరితగతిన పూర్తి చేయాలని సూచించామన్నారు.